క్లుప్తంగా

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



రామకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కేవీపల్లె : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న మండలంలోని టీజీ వడ్డిపల్లె ఉపాధ్యాయుడు రామకృష్ణారెడ్డిని ఘనంగా సన్మానించారు. మంగళవారం మండలంలోని గ్యారంపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో సీఆర్‌సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డిని సత్కరించారు. ఎంఈఓలు రెడ్డిబాషా, సుబ్రమణ్యంరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పచ్చార్ల సుధాకర్, హెచ్ఎం శ్రీహరి, యూటీఎఫ్ నాయకులు చంద్రశేఖర్, ఎస్టీయూ నాయకులు భాస్కర్ రెడ్డి, నందకుమార్, సుబ్రమణ్యం, వేణు గోపాల్, భవ్య, ఆనందరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, అమరనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి నియోజకవర్గ స్కూల్స్ గేమ్స్

మదనపల్లె సిటీ: మదనపల్లె నియోజకవర్గ స్కూల్ గేమ్స్ ఈనెల 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు నియోజకవర్గ కో ఆర్డినేటర్ భద్రయ్య తెలిపారు. మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండల స్థాయిలో ఎన్నికైన స్కూల్స్ గేమ్స్ పోటీల్లో విజేతలైన క్రీడాకారులు 20న అండర్-14,-17 బాల, బాలికలు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో నిమ్మనపల్లె సమీపంలోని రెడ్డివారిపల్లె మోడల్‌స్కూల్‌లో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 21వ తేదీన మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో చెస్, యోగా, బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.

రేపు డయల్ యువర్ డీఎం

మదనపల్లె సిటీ: డిపో పరిధిలోని సమస్యలు పరిష్కారం కోసం గురవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ-1,2 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. సర్వీసుల వలన సమస్యలు, ఆర్టీసీ ఆదాయం పెంచడానికి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. ఫోన్ నంబర్ 9959225676కు ఫోన్ చేయాలని తెలిపారు.

బ్యాటరీ మెయింటెన్స్‌లో రాష్ట్రంలో మూడో స్థానం

మదనపల్లె-1 డిపో బ్యాటరీ మెయింటెన్స్‌లో రాష్ట్రంలో మూడో స్థానం నిలిచినట్లు డీఎం తెలిపారు. ఇందుకు కృషి చేసిన ఎలక్ట్రీషియన్స్ శ్రీకాంత్, ప్రసాద్, ధనుంజయ, జగన్‌ను అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.


అమ్మవారికి అభిషేకం



అమ్మవారి ప్రతిమను ప్రత్యేకంగా అలంకరించిన భక్తులు

పెద్దతిప్పసముద్రం: స్థానిక శివాలయంలో మంగళవారం సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పున్నమి సందర్భంగా అమ్మవారికి అభిషేకం, దుర్గా హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

నివాళి



నారాయణరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి నిసార్‌అహ్మద్

నిమ్మనపల్లె : నిమ్మనపల్లె మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ సదాశివరెడ్డిని, కుటుంబసభ్యులను మంగళవారం మదనపల్లె నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి నిసార్‌అహ్మద్ పరామర్శించారు. సోమవారం రాత్రి సదాశివరెడ్డి మామ నారాయణరెడ్డి(82) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న నిసార్‌అహ్మద్, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి మండలంలోని నిమ్మనపల్లె పంచాయతీ బోడుమల్లయ్యగారిపల్లెలోని సదాశివరెడ్డి ఇంటికి వెళ్లి నారాయణరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

విద్యార్థికి సన్మానం

గుర్రంకొండ: స్థానిక ప్రభుత్వ తెలుగు జూనియర్ కళాశాలకు చెందిన ఎస్. ఉమ్మాజైబు అనే విద్యార్థిని ఎంబీబీఎస్ ఉచిత సీటును సాధించడం పట్ల కళాశాల సిబ్బంది, అధ్యాపకులు ఘన సన్మానం చేశారు. గుర్రంకొండకు చెందిన ఉమ్మాజైబు స్థానిక ప్రభుత్వ తెలుగు జూనియర్ కళాశాలలో ఇంటర్ బైపీసీ చదివింది. ఇటీవల ప్రకటించిన నీట్ పరీక్షా ఫలితాల్లో 720 మార్కులకు గానూ 575 మార్కులు సాధించింది. నీట్‌లో జరిగిన కౌన్సిలింగ్‌లో ఎన్టీయార్‌హెల్త్ యూనివర్సిటీ వారు విద్యార్థికి తిరుపతి స్విమ్స్ మెడికల్ కళాశాలో ఎంబీబీఎస్‌లో సీటు కేటాయించారు. మంగళవారం స్థానిక కళాశాలలో విద్యార్థిని కళాశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు.

వైద్య విద్యను దూరం చేసే కుట్ర



కూటమి ప్రభుత్వం పేద, మధ్య తరగతి కుటుంబాలకు వైద్య విద్యను దూరం చేసే కుట్ర పన్నుతోంది. కొత్తగా ప్రభుత్వ వైద్య కళాశాలల ఏర్పాటుకు మోకాలడ్డుతోంది. ఉన్న కళాశాలలను ప్రైవేటు పరం చేసేందుకు ప్రయత్నిస్తోంది. దీనివల్ల వైద్య విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులతో పాటు ప్రజలకు కూడా నష్టం కలుగుతుంది. వైద్య కళాశాల అనుబంధ ఆస్పత్రుల్లో యూజర్ చార్జీల భారం పడుతుంది. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు ప్రతి పేద విద్యార్థికి ఉన్నత చదువులను ఉచితంగా అందుబాటులోకి తెస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చాక పేద విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షలాగా మార్చుతున్నారు. పేద విద్యార్థుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలి.

–ఎస్.అబ్దుల్ కలీమ్, ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్, మదనపల్లె



వైద్య విద్య కలలు చిదిమేయవద్దు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పురుడుపోసుకున్న ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుకు కట్టబెట్టే కుట్ర జరుగుతోంది. అందులో భాగంగా కూటమి ప్రభుత్వం ఐదు ప్రభుత్వ మెడికల్ కళాశాలకు నేషనల్ మెడికల్ కమిషన్ అనుమతులు రాకుండా అడ్డుపడుతోంది. కూటమి ప్రభుత్వం కారణంగా పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్యవిద్య కలగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. కేంద్రంపై పోరాడి మెడికల్ సీట్లను పెంచాల్సిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్న సీట్లను వెనక్కి పంపడం దుర్మార్గమన్నారు. మెడికల్ కళాశాల సీట్లు పెరిగితే పేద విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పేదలకు వైద్య విద్యను విద్యార్థులకు దూరం చేసేందుకు కుట్ర పన్నుతోంది.

–వినయ్, మదనపల్లె

ఆరోగ్యవంత సమాజంతోనే అభివృద్ధి సాధ్యం



మదనపల్లె : ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, చైర్‌పర్సన్ మనూజారెడ్డి



కలకడ: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు



కలికిరిలో స్వచ్ఛతా హి సేవా ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

మదనపల్లె : ఆరోగ్యవంతమైన సమాజంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. స్వచ్ఛ గ్రామాలు, పట్టణాలు లక్ష్యంగా కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో ప్రజలందరూ విజయవంతం చేయాలని ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా మహిళాసంఘాల సభ్యులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, కౌన్సిలర్ ప్రసాద్ బాబు, రహీం, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే మదనపల్లె మండలంలోని 25 గ్రామపంచాయతీల్లో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా సర్పంచుల ఆధ్వర్యంలో ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, సచివాలయ, ఈజీఎస్ సిబ్బంది, ప్రజలు, విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేశారు.

స్వచ్ఛతా హి అవగాహన ర్యాలీ

తంబళ్లపల్లె: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేసేందుకు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సురేంద్రనాథ్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో అధికారులు, కూటమి నాయకులు, విద్యార్థులు నినాదాలు చేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు.

పరిశుభ్రతతోనే మెరుగైన ఆరోగ్యం

కేవీపల్లె : పరిశుభ్రతతోనే మెరుగైన ఆరోగ్యం పొందవచ్చునని ఎంపీడీఓ యాదవేంద్ర అన్నారు. మంగళవారం మండలంలోని గర్నిమిట్టలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. సర్పంచ్ నాగలక్ష్మి, ఈఓపీఆర్‌డీ గఫూర్, కేవీపల్లె జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం వై.వి.రమణ, పంచాయతీ కార్యదర్శులు సిగ్బతుల్లా, గీత, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్రంకొండలో ర్యాలీ

గుర్రంకొండ: మండల కేంద్రమైన గుర్రంకొండలో స్వచ్ఛతా హి సేవ ర్యాలీ నిర్వహించారు. మంగళవారం స్థానిక తెలుగు జెడ్పీహైస్కూల్ నుంచి వివిధ శాఖలకు చెందిన అధికారులు విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు. స్వచ్ఛతా హి సేవ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం బస్టాండులో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో ర్యాలీ

పెద్దమండ్యం: మండలంలోని కలిచెర్ల, పెద్దమండ్యం గ్రామాలలో స్వచ్ఛతా హి సేవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండు కూడలిలో మానవహారం పాటించారు. అలాగే కలిచెర్ల జూనియర్ కళాశాల నుంచి బస్టాండు కూడలి వరకు విద్యార్థులు, అధ్యాపకులు ప్లకార్డులతో ర్యాలీ చేశారు. బస్టాండు కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. స్వచ్ఛత– పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సోదనపల్లె బాబా, పంచాయతీ కార్యదర్శి జగన్‌మోహన్, కళాశాల ఎన్ఎస్ఎస్ పీఓ వెంకటనరసయ్య, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కలికిరిలో స్వచ్ఛతా హి సేవా ర్యాలీ

కలికిరి: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం కలికిరి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బాలికోన్నత పాఠశాల నుంచి ఎంపీడీఓ గంగయ్య, ఎంఈఓ కరీముల్లా ఆధ్వర్యంలో విద్యార్థులు మానవహారం చేపట్టారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ యల్లప్ప, ఈఓపీఆర్డీ పరశురాం, సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం ఆయా గ్రామ ప్రజా పతినిధులు, అధికారుల ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ, తడి, పొడి చెత్త నిర్వహణ, చెత్త నుంచి సంపద తయారీపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ కేఎస్ బాలాజీ, జేఈలు హరి, శ్రీనివాసులు, నిరంజన్, ఎంఈఓలు నారాయణ, గౌస్‌పీర్, ఏపీఓ తిరుపాలప్ప,, ఏపీఎం శ్రీనివాసులు, ఏఓ ప్రేమలత, ఆంజినేయులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో..

బి.కొత్తకోట: స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని గట్టు, బి.కొత్తకోటల్లో విద్యార్థులు, అధికారులు ర్యాలీలు నిర్వహించారు. బి.కొత్తకోటలో మానవహారంగా ఏర్పడి పరిశుభ్రతపై నినాదాలు చేశారు. ప్లాస్టిక్ వినియోగం నిషేధించాలని, పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ప్లకార్డులు ప్రదర్శించారు. అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించే స్వచ్ఛ కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ పాల్గొనాలని ఎంపీడీఓ శంకరయ్య, ఎంఈఓ రెడ్డిశేఖర్, ప్రిన్సిపాల్ శీనునాయక్ కోరారు. హెచ్ఎం లలితకుమారి, భారత స్కూల్ కరెస్పాండెంట్ శ్రీనివాసులు, నూర్ మహమ్మద్, కేశవులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం

ములకలచెరువు: మండలంలోని అన్ని పంచాయతీల్లో సర్పంచులు, కార్యదర్శుల ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను శుభ్రం చేయించారు.

పీలేరు : స్వచ్ఛత పట్ల ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత వహించాలని పీలేరు పంచాయతీ ఈఓ గురుమోహన్ అన్నారు. మంగళవారం పీలేరు పట్టణంలో స్వచ్ఛతా హి సేవా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి పంచాయతీ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతమ్మ, హెచ్ఎం నటరాజన్, ఎన్‌సీసీ అధికారులు మురళి, జయపాల్, వెంకటరమణ పాల్గొన్నారు.

కలకడ : పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా మండల వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించారు. కలకడ బస్టాండ్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి భరత్‌కుమార్, యూఓపీఆర్‌డీ లతీఫ్‌ఖాన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లె: గ్రామాల్లో స్వచ్ఛత పాటించేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని మండల ప్రత్యేక అధికారి ప్రసాద్ అన్నారు. ఎంపీడీఓ రమేష్ బాబు, ఎంఈఓ నారాయణ, నిమ్మనపల్లె సర్పంచ్ పాపులమ్మ, జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో కలిసి ఎంపీడీఓ కార్యాలయం నుంచి నిమ్మనపల్లి బస్టాండ్ కూడలి వరకు స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈఓపీఆర్డీ చలపతిరావు, ఏపీఓ రమేష్, పంచాయతీ కార్యదర్శులు వెంకటరమణారెడ్డి, రాజేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పెద్దతిప్పసముద్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు, విద్యార్థులు



పీలేరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు, నాయకులు, విద్యార్థులు



బి.కొత్తకోట: గట్టులో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు



పెద్దమండ్యంలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు

సమానత్వం కోసం పోరాడిన పెరియార్



మదనపల్లె : పెరియార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

మదనపల్లె : నాస్తికోద్యమం, స్వాభిమాన పోరాటం ,మహిళాభ్యుదయం, కులరహిత సమాజం, సామాజిక సమానత్వం పెరియార్ ఇ.వి.రామస్వామి పోరాడారని బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్ తెలిపారు. మంగళవారం పెరియార్ 145వ జయంతి సందర్భంగా బీఎస్పీ ఆధ్వర్యంలో పెరియార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీసీ చైతన్యసమితి అధికార ప్రతినిధి సహజీవన్‌బాబు ఆధ్వర్యంలో సంతగేటు అన్నాక్యాంటీన్ వద్ద అన్నదానం నిర్వహించారు. బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు ఆధ్వర్యంలో మెట్రో కాంప్లెక్స్ సర్కిల్‌లో పెరియార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే బహుజన్ యువసేన(బీవైఎస్) అధ్యక్షుడు పునీత్ ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్‌లో పెరియార్ చిత్రపటానికి నివాళులర్పించారు.

పీలేరురూరల్ : సాంఘిక సమానత్వానికి పెరియార్ రామస్వామి పునాదులు వేశారని భారతీయ అంబేద్కర్ సేన (బాస్) జిల్లా కో కన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక బాస్ కార్యాలయంలో పెరియార్ రామస్వామి 145వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంఘిక, ఆర్థిక, రాజకీయ అణచివేతల నుంచి విముక్తి కల్పించడానికి పెరియార్ ఉద్యమించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బాస్ నాయకులు మల్లికార్జున, ముల్లంగి కృష్ణయ్య, హరినాథ, గురునాథ, గురవయ్య, హరీష్, సుబ్రమణ్య, హరి పాల్గొన్నారు.

‘చెకుముకి’ తో శాస్త్రీయ దృక్పథం పెంపు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు ప్రభుచరణ్ తదితరులు

వాల్మీకిపురం: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి చెకుముకి పోటీలు దోహదపడతాయని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్ తెలిపారు. మంగళవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి వాల్‌పోస్టర్‌ను స్థానిక ఉర్దూ మైనార్టీ గురుకుల పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు చెకుముకి పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. సెప్టెంబర్ 25న పాఠశాల స్థాయి, అక్టోబర్ 1న మండల స్థాయి, అక్టోబర్ 27న జిల్లా స్థాయి, నవంబర్ 9, 10 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తారని, 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షలకు అర్హులన్నారు. ఆసక్తి గల విద్యార్థులు రూ. 10 చెల్లించి, పరీక్షలు రాయవచ్చునని తెలిపారు.

మోదీ నాయకత్వం స్ఫూర్తిదాయకం

మదనపల్లె : ప్రధాని మోదీ నాయకత్వం స్ఫూర్తిదాయకమని రాజంపేట పార్లమెంటరీ బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్ కొనియాడారు. మంగళవారం నరేంద్రమోదీ 74వ జన్మదినం సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లె ప్రశాంత్, పట్టణ అధ్యక్షులు బర్నేపల్లెరవికుమార్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు.

ములకలచెరువు: మండల కేంద్రంలో దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గోపాల్‌రెడ్డి, మండల కన్వీనర్ జయరాంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

గుర్రంకొండ: గుర్రంకొండలో ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీశాఖ అధ్యక్షుడు రామాంజులు, రాజంపేట సోషియల్ మీడియా కన్వీనర్ భరత్, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగులను నులిపేద్దాం



పీలేరురూరల్ : ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న అధికారులు



కలకడ : పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న డాక్టర్ జవహర్‌బాబు



వాల్మీకిపురం: విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న డాక్టర్ లోకవర్ధన్

వాల్మీకిపురం: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా స్థానిక పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్ ఈ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సంవత్సరం బిడ్డ నుంచి 19 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను మిగించాలని సూచించారు. అలాగే మండలంలోని చింతపర్తి, మంచూరు, శాఖంవారిపల్లిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఉమా అమరేశ్వరి, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, వైద్య సిబ్బంది ఇంద్రాణి, భానుబి, ఈశ్వరి, సరోజిని, అమృత తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి

కలకడ : ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, విద్యా సంస్థలలో చదువుతున్న 1 నుంచి 19 సంవత్సరాలలోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలను తప్పనిసరిగా వేయించాలని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ డాక్టర్ జవహర్ బాబు సూచించారు. మంగళవారం జాతీయ నులిపురుగుల దినోత్సవం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పాపిరెడ్డిగారిపల్లె పాఠశాలలో చిన్నారులకు మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో మట్టి ద్వారా నులిపురుగుల గుడ్లు పిల్లల చేతుల ద్వారా శరీరంలోకి చేరి నులిపురుగులుగా, ఏలిక పాములుగా, కొంకిపురుగులు అనే పరాన్న జీవులుగా పెరిగి పిల్లల్లో తీవ్ర పోషకారలోపం కలుగచేస్తాయని చెప్పారు. ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు, పీహెచ్ఎన్‌కే సుబ్బరత్నమ్మ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత అవసరం

ములకలచెరువు: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ప్రభుత్వ డాక్టర్ జాహ్నవిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మోడల్‌స్కూల్‌లో విద్యార్థులకు నూలిపురుగుల నివారణ కోసం మాత్రలు పంపిణీ చేశారు. అనంతరం దగ్గు, జలుబు ఉన్న విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

పీలేరురూరల్ : నులిపురుగుల నిర్మూలనతో ఆరోగ్యవంతమైన జీవితం పొందవచ్చునని ఎంఈఓలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతి అన్నారు. స్థానిక మెయిన్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు.

రైతుబజార్‌లో వ్యాపారాలకు దరఖాస్తుల ఆహ్వానం

మదనపల్లె : అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని రాజీవ్ రైతుబజార్‌లో ఖాళీగా ఉన్న 12 స్టాల్స్, ఐదు షాపులకు సైజు 10/20 జిల్లా సెలక్షన్ కమిటీ వారిచే అద్దె ప్రాతిపదిక్షపై కేటాయించుటకు అర్హత గల డ్వాక్రా గ్రూపు, హోల్‌సేల్/రిటైల్ వ్యాపారస్తుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుండి 27వ తేదీలోగా దరఖాస్తు ఫారాన్ని మదనపల్లెలోని రాజీవ్ రైతుబజార్‌లో కానీ లేదా రాయచోటిలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోని జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. కేటాయించిన స్టాల్స్, షాపుల సంఖ్య తగ్గించుట/పెంచుట, రద్దు చేసేందుకు జాయింట్ కలెక్టర్‌కు సంపూర అధికారం ఉందని పేర్కొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

తంబళ్లపల్లె : స్థానిక టీఎస్ వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు నాల్గవ విడత దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి మంగళవారం తెలిపారు. ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లో 3, సివిల్‌లో 7, ఫిట్టర్‌లో 15 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. పదో తరగతి పాస్, ఇంటర్ పాస్, ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. ఈనెల 26వ తేదీ లోపు ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో గానీ నేరుగా ఐటీఐ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవచ్చునన్నారు.